వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 19 ఫిబ్రవరి 2025

## అశ్వ వాహనంపై శ్రీరంగనాథ స్వామి దర్శనం

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :



పులివెందులలో శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీరంగనాథ స్వామి అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అయ్యవారిపై అలకబూనిన అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలు అలిగి వెళ్లడంతో అశ్వవాహనమెక్కి వారిని బుజ్జగించేందుకు శ్రీ రంగనాథ స్వామి ఒక్కడే అశ్వ వాహనంపై కొలువు తీరారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈవో కొట్టే వెంకటరమణల నేతృత్వంలో గ్రామ ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. సోమేపల్లి కృష్ణ రాజేష్ శర్మ, ఉప అర్చకులు శశిధర్ శర్మ ,నాగ ఫణీంద్ర శర్మ, రాజసింహల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో శ్రీ రంగనాథస్వామి ట్రస్ట్ సీఈవో అల్లం రంగనాయకులు కార్యవర్గ సభ్యులు దశరథరామయ్య, మాధవాచారి, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### శాంతి భద్రతలు కాపాడుతూ

## నేరాలు తగ్గించాలి

### రాజంపేట అర్బన్ సిఐ రాజాకు ఎస్పీ ఆదేశాలు

రాజంపేట అర్బన్ ఫిబ్రవరి18 ప్రభాతవార్త



రాజంపేట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడుతూనే నేరాలు కూడా తగ్గించేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. రాజంపేట అర్బన్ సీఐగా పి రాజా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సైబర్ నేరాలపై దృష్టి సాధించాలని కొత్త సిఐకి సూచించారు.

# 20 సూత్రాల అమలు పటిష్టంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి..**

**20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్‌తో కలిసి అధికారులతో సమీక్ష**

**వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను అధిగమించాలి**





కడప, ఫిబ్రవరి 18 : ప్రభాతవార్త

వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా.. జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాలను అత్యంత పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజుల రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, సి. ఆదినారాయణ రెడ్డిలతో కలిసి జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో.. 20 సూత్రాల కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలలో జిల్లలో జరిగిన పురోగతిపై సమీక్షించడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ సమీక్షలో వికసిత భారత్, స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047 లక్ష్య సాధనలో చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించడం జరిగిందన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా జిల్లాలో ప్రధానంగా చేపడుతున్న 10 అంశాలైన 1. జీరో పావర్టీ, 2. ఎంప్లాయిమెంట్, 3. స్కిల్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్, 4. వాటర్ సెక్యూరిటీ, 5. వ్యవసాయం అధునాతన సాంకేతికత, 6. గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్, 7. కాస్ట్ ఆప్టిమైజెషన్, 8. ప్రొడక్ట్ పర్ఫెక్షన్, 9. స్వచ్ఛ ఆంధ్ర, 10. డీప్ టెక్ ఆల్ వాక్స్ ఆఫ్ లైఫ్.. అంశాలపై సమీక్షించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, అమృత్ పథకం, పీఎం ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, పీఎం సూర్య ఘర్ పథకం, పీఎం కుసుమ్ వ్యవసాయానికి విద్యుత్ అందించే పథకం, అలాగే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న యూరియా సబ్సిడీ అలాగే జాతీయ ఆహార భద్రత పథకం, గరీబ్ కళ్యాణ అన్న యోజన తదితర అంశాలపై చైర్మన్ సమగ్రంగా సమీక్షించారన్నారు. కాగా జిల్లాలో ప్రధానంగా వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యాన పంటల సాగుకు జిల్లాలో అపారమైన వనరులు పుష్కలంగా ఉన్నాయని. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా గత ఐదేళ్లలో చేపట్టిన పనులకు గాను సిమెంట్ కొనుగోలుపై పక్కాగా సోషల్ ఆడిట్ నిర్వహించాలని చైర్మన్ తెలిపారన్నారు.

తాజాగా ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి అనే అంశాల్లో ఫిబ్రవరి 2024 వరకు ఉత్తమ పనితీరు కనబరిచినందుకు గాను జిల్లాకు రూ. 3 కోట్ల నగదు పురస్కారాన్ని నీతీ ఆయోగ్ ప్రకటించిందన్నారు. దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాల్లోని 36 జిల్లాలకు ఈ అత్యుత్తమ పురస్కారాన్ని నీతీ ఆయోగ్ ప్రకటించగా అందులో వైఎస్ఆర్ జిల్లా కూడా ఒకటిగా పురస్కారాన్ని అందుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు.

గతంలో కూడా "జలశక్తి అభియాన్ క్యాచ్ ది రైన్ : 2022" అమలులో భాగంగా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల పురోగతి ఫలితంగా జిల్లాలో విస్తృతంగా వాన నీటిని ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాల శాతం ఆశించిన స్థాయి కంటే అధిక అందుకోగలిగామన్నారు. జిల్లా అటవీశాఖ, నీటి యాజమాన్య సంస్థ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న టీమ్ వర్క్ సత్ఫాలితలను అందిస్తోందన్నారు.

2018లో "నీతీ ఆయోగ్" ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. మన రాష్ట్రంలో వైఎస్ఆర్ జిల్లా, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఆయా జిల్లాల్లో సామాజిక స్థాయిని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడం జరిగిందన్నారు.

జలశక్తి అభియాన్ నిర్వహణలో 2020కి గాను జాతీయ స్థాయిలో మన జిల్లాకు ద్వితీయ దక్కిందని, అంతేకాకుండా 2018లో జాతీయ మొదటి వాటర్ అవార్డుల్లో మొదటి స్థానం దక్కగా, 2019లో కూడా సౌత్ జోన్ విభాగంలో మొదటి స్థానం దక్కిందని గుర్తు చేశారు. అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం జిల్లా స్థాయిలో సబ్ కమిటీల పర్యవేక్షణ సాగుతోందన్నారు. ఆకాంక్ష జిల్లా ఆశయ సాధన లక్ష్యాలను సంతృప్త స్థాయిలో.. సాధించేందుకు నిరంతరం జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయిలో కృషి చేస్తోందని వివరించారు. అన్ని అంశాల్లో కూడా జాతీయ స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో ముందుకు సాగుతోందన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో వైఎస్ఆర్ జిల్లా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, రాష్ట్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల సామాజికఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా వినూత్న వ్యూహాలతో చురుకైన పాలన సాగించడం వల్ల నిర్ణీత కాలంలోనే ఆకాంక్షిత జిల్లా లక్ష్య సాధన మరింత సులువుగా మారనుందన్నారు.

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ పంటలకు విపరీతమైన పురుగుల మందులు వాడుతున్నారని ఆహారం విషపూరితం కాకుండా 20 సూత్రాల అమలులో నూతన విధానాలను అమలు చేయాలని కోరారు. అలాగే. టిడ్కో గృహ సముదాయాలను కొందరు కూలదోసి అందుకు సంబంధించిన సిమెంట్ స్టాకును కుడా దోచుకొన్నారని దానిపై విచారణ చేపట్టాలన్నారు.

మైదుకూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంక్రీట్ రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని మరమ్మతులు చేపట్టాలని కోరారు. అధికారులు ప్రజాప్రతినిధుల ఫోన్ కాల్స్ కు వెంటనే స్పందిస్తే ప్రజా సమస్యలు వెంటనే పరిష్కారం తోపాటు ప్రభుత్వానికి మంచి పేరు కూడా వస్తుందన్నారు.

జమ్మలమడుగు ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా ఆర్థిక అభివృద్ధిలో పరిశ్రమలు, పర్యాటకం ప్రధాన భూమిక పోషించనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, సహాయ సహకారాలను అందిపుచ్చుకుని అధికారులు చక్కటి ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమినా...అమ్మేయ్

**కొత్త జాతీయ రహదారికి సమీపంలో ఇష్టారాజ్యంగా అక్రమణలు... కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిలకు దిక్కేది?**



వత్తలూరు రోడ్డులో అక్రమంగా నిర్మించిన భవణం



ఎక్కడ పడితే అక్కడ అక్రమంగా కంచెలు

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:

ప్రభుత్వ భూములకు దిక్కులేదు. తమ సొంత ఆస్థి అన్నట్లు అమ్ముకుంటున్నారు. అధికారులు కళ్లు ఉండి చూడలేక పోతున్నారు. కరెన్సీ కట్టలు వారి కళ్లకు గంతెలు కడుతున్నాయి. కొందరు అవినీతి రెవెన్యూ అధికారుల పుణ్యమా అని కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు ఇష్టారాజ్యంగా అమ్ముకుంటున్నారు. నేతల పంచన చేరినా కొంతమంది అక్రమార్కులు తమ ఆస్థి అన్నట్లు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. కొత్త జాతీయ రహదారికి వంద మీటర్ల దూరంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల దందాకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి...

కడప-రేణిగుంట నూతన గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారికి కేవలం 100మీటర్ల దూరంలో వత్తలూరు రోడ్డు ఉంది. ఈ రోడ్డుపై ఏ మాత్రం దిక్కు దివానం లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని అమ్ముకుంటున్నారు. రోడ్డు ప్రక్కనే అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న అడ్డుకునే వారు లేరు. గత వైకాపా హయాంలో జగనన్నా కాలనీల్లోనే ఒక లబ్దిదారునికి ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చేందుకే కొండలు, గుట్టలపైకి వెళ్లాల్సిన దుస్థితి కానీ ప్రభుత్వ భూమి ప్రధాన రహదారికి ప్రక్కనే ఉన్న పట్టించుకునే వారు కరువయ్యారు. ఫలితంగా మూడుసెంట్లు, అయిదు సెంట్లు, పది సెంట్లు బిట్లుగా వేసి అమ్ముకున్నారు. లక్షల రూపాయలు సొమ్ము చేసుకున్నారు. ఓ ముఖ్యనేత సోదరుడి డ్రైవర్ అంటూ ఒకరు, మరొకరు ఓ అధికారికి లక్షలు ముట్టజెప్పి ఆక్రమణలకు పాల్పడ్డారు. స్థానికంగా ఉంటున్న కొందరు నేతలు కూడ కక్కుర్తి పడి కమీషన్ తీసుకొని ఆక్రమణలకు తమ ఆస్థి అన్నట్లు సహకరించారు. ఫలితంగా కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం కూచివారిపల్లె గ్రామ పొలంలో అక్రమార్కుల పాలైంది. సర్వే నెంబర్ 1584లో సుమారు రెండు ఎకరాల స్థలం ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ ఆక్రమించడం, చుట్టూ సిమెంట్ దిమ్మెలు కట్టడం, అమ్మివేయడం జరుగుతోంది. ఈ దందా అంతా స్థానికంగా ఉంటున్న వీఆర్వోలకు తెలియంది కాదు. గతంలో పనిచేసిన ఓ ఆర్ఐ, ఓ తహసీల్దార్‌కు కూడ పెద్దఎత్తున ముడుపులు ముట్టాయి. ఫలితంగానే ఈ ఆక్రమణల జోలికి వెళ్లలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి హెచ్చరికల నేపథ్యంలో కోట్ల రూపాయల విలువైన ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని విలువైన ఆస్థిని ప్రజా అవసరాలకు వినియోగించుకునేలా చూడాల్సిన అవసరం అధికారులపై ఉంది.



ఒక్కరోజు జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి కడప నగరంలోని సి.పి. బ్రౌన్ కేంద్ర గ్రంథాలయం బాషా పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్. సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రంలో జానుమద్ది సాహితీపీఠం వారి సౌజన్యంతో ప్రతిష్టించిన తెలుగు సూర్యుడు, తెలుగు భాషా సముపార్జకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ విగ్రహాన్ని పరిశీలించిన అనంతరం సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయాత్రాలను ఒక్కొక్కటిగా తిలకించిన అజయ్ జైన్ గ్రంథాలయంలో నిక్షిప్తం చేసిన అమూల్యమైన, వెలకట్టలేని పురాతన తాళపత్ర గ్రంథ నిధిని, పరిశోధనా గ్రంథాలను, పలు రకాల గ్రంథాలను పరిశీలించి తెలుగు బాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందని సంతోషం వ్యక్తం చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా కలెక్టర్ తోపాటు పాల్గొన్న బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది తదితరులు.



# మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని, పిల్లల సంక్షేమమే ధ్యేయంగా కట్టుదిట్టంగా అమలు చేయాలి

**జిల్లాలో బాల్య వివాహాలను రూపుమాపాలి.**

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

రాయచోటి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని, పిల్లల సంక్షేమ సంక్షేమమే ధ్యేయంగా కట్టుదిట్టంగా అమలు చేయాలని, అన్నమయ్య జిల్లాలో బాల్యవివాహాలను రూపుమాపాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, మిషన్ వాత్సల్య కార్యక్రమం పై జిల్లా స్థాయి బాలల సంక్షేమం మరియు పరిరక్షణ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి ఈ సమావేశాన్ని ప్రారంభిస్తూ.... మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి శిశు సంక్షేమం మరియు పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. అలాగే గ్రామ మరియు వార్డు స్థాయిలలో సర్పంచ్ అధ్యక్షతన పోలీస్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ కమిటీ జిల్లా స్థాయి మరియు గ్రామస్థాయిలలో తప్పిపోయిన బాలలు పాఠశాల మానేసిన పిల్లలు, అక్రమ రవాణా బాధితులు, వలస వచ్చిన పిల్లలు, అనాథ పిల్లలు, తదితర పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారి శ్రేయస్సు కోసం తగు చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మిషన్ వాత్సల్యాను కట్టుదిట్టంగా అమలు చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అది సాధ్యమవుతుంది అన్నారు. మిషన్ వాత్సల్య కార్యక్రమంలో ముఖ్యంగా అనాథ పిల్లలు, ప్రత్యేక రక్షణ కావలసిన పిల్లలు, నేరాల బారిన పడిన పిల్లలు, తదితరులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని ఎన్జీవోలు మరియు సివిల్ సొసైటీలతో సమన్వయం చేసుకొని మిషన్ ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అన్నమయ్య జిల్లాలో బాల్యవివాహాలను రూపుమాపేందుకు పోలీస్ శాఖ, విద్యాశాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, తదితర శాఖల వారు సమన్వయంతో పని చేయాలన్నారు. వచ్చే బుధవారంలోగా జిల్లాలోని అనాథ పిల్లలు అందరిని మ్యాప్ చేయాలని జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. 1098 ద్వారా బాల్య వివాహాలపై వచ్చే ఫోన్ కాల్స్ ను అప్రమత్తతతో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, మదనపల్లె బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, జి ఎస్ డబ్ల్యూ ఎస్, విద్య, వైద్య, సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల అభివృద్ధికి కృషి

**పొరుమామిళ్ళ రూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**



బద్వేలు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమ అభివృద్ధి కి నావంతుగా కృషి చేస్తున్నట్లు తెలుగు దేశం పార్టిబద్వేలునియోజ కవర్గ సమన్వయ కర్త రితీష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బద్వేలు లోని తెలుగు దేశం పార్టీ కార్యాల యంలో తెలుగు దేశం పార్టీ నేతలు ఎరసాల కృష్ణారెడ్డి, బి.కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్య క్షుడు రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, రామ మోహన్ రెడ్డి,పాణ్యం సత్యం, హర్షవర్ధన్ రెడ్డి,జయరాం గౌడ్ ల ఆధ్వర్యంలో పోరుమామిళ్ల, కాశినాయన, కలస పాడు, బి.కోడూరు మండలాలకు చెందిన దాదాపు 30 మంది పాత్రికేయులు రితీష్ రెడ్డి ని కలిశారు. ఈసందర్భంగా వారు పది సంవత్స రాలుగా ఇంటి స్థలాల కోసం ధరఖాస్తులు చేసుకుంటున్నామని, ఏఒక్కరు మాకు స్థలాలు ఇవ్వలేద ని తమరు మా విన్నపాన్ని మన్నించి ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి పత్రం అందించారు. అందుకు రితీష్ రెడ్డి సానుకూలంగాస్పందించిజర్నలిస్టుల నిత్యం ప్రజా సమస్యలపై జీత భత్యాలు లేక పోరాటం చేస్తూ అగమ్యగోచరంగా జీవనం సాగిస్తున్న విషయాన్ని నా పాదయాత్రలో గుర్తించామన్నారు.అప్పుడే చెప్పా ను తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే వారి సంక్షేమ అభివృద్ధి కి కృషి చేస్తామని చెప్పానని,ఇచ్చిన మాటకు కట్టుబడి మీకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు.పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి,ఇల్లు మంజూరు చేయిస్తామన్నారు.నాలుగు మండలాల పాత్రికేయులు ఒకే కుటుంబ సభ్యులుగా కలిసిమెలిసి ఉండాలని వారి శ్రమకు తగిన ఫలి తం త్వరలోనే నా వంతు కృషిచేసి వారికి తగు న్యాయం చేకూరుస్తా నని హామీ ఇచ్చారు. అందరి వినతిపత్రాలు తీసుకుని ఆర్డీఓ, తహశీల్దార్ల కు పంపి వారి ద్వారా పంపిణీ కి కృషి చేస్తామన్నా రు.ఇంటిస్థలాలు ఇచ్చి కాలనీ నిర్మిస్తే ఆకాలనీకి శ్రీ బిజీవేముల వీరారెడ్డి జర్నలిస్టు కాలనీగా ఏర్పా టు చేస్తామని పాత్రికేయులు చెప్పగా త్వరలో మీ కళలను సాకసరం చేసి చూపుతానని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలోపోరుమా మిళ్ల, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు మండలాల్లో ని ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మైనార్టీల పక్షపాతి సీఎం చంద్రబాబు

**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**



ఏపీ సీఎం చంద్ర బాబు నాయుడు మైనార్టీల పక్షపాతి అని, మైనార్టీల సంక్షేమం కోసం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారాన్నారని మాజీ డిప్యూటీ మేయర్ బి. ఆరిపుల్లా అన్నారు. మంగళవారం కడప లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమంలో భాగంగా ఇమామ్, మోజమ్‌ల గౌరవవేతనాలు రూ.45 కోట్లు మంజూరు చేసారన్నారు.2024 ఏప్రిల్ నుంచి గౌరవ వేతనాలు చెల్లింపును చంద్రబాబు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం అభినందనీయం అన్నారు. అలాగే గత జగన్ ప్రభుత్వంలో నిలిపేసిన రంజాన్ తొఫా పునరుద్ధరించి రాష్ట్రంలోని ప్రతి పేద ముస్లిం కుటుంబం సంతోషంగా రంజాన్ పండుగ చేసుకుంటారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## వికసిత భారత్ లక్ష్యం

**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**



కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలలో జరిగిన పురోగతిపై కడప జిల్లా అధికారులతో సమీక్షించడం జరిగిందని 20 సూత్రాల కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్ సమీక్ష నిర్వహించారు. వికసిత భారత్, స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047 లక్ష్య సాధనలో చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించాలని తెలిపారు. మంగళవారం కడప నగరంలోని బిజెపి కార్యాలయంలో ఎంపీ సీఎం. రమేష్ 59వ పుట్టినరోజు సందర్భంగా 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగళ శశి భూషణ్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మి నారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాలివీడులో గ్రాస్ రూట్ స్టేక్ హోల్డర్స్ కార్యక్రమం

**గాలివీడు, ఫిబ్రవరి 18(ప్రభాతవార్త):**



గాలివీడు వెలుగు కార్యాలయం నందు మంగళవారం గ్రాస్ రూట్ స్టేక్ హోల్డర్స్ ట్రైనింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌నాయక్, న్యాయవాది కిరణ్‌కుమార్, రెడ్స్ సంస్థ ట్రైనర్ ఎల్లప్ప, శ్రీనివాసులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు, మానవ అక్రమరవాణా, బాలికలపై జరిగే అఘాయిత్యాల గురించి నేటి సమాజంలో జరుగుతున్న అక్రమాలపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే పేదరికంగా ఉన్నవారు, ఆర్థికంగా వెనుకబడిన వారు, ఒంటరి మహిళలను, వికలాంగులను గుర్తించి వీరికి మాయమాటలు చెప్పి పెద్ద నగరాలలోని వ్యభిచార గృహాలకు తరలించి అమ్మివేస్తున్నారని గ్రామాల్లో ఇలాంటివి జరగకుండా స్టేక్ హోల్డర్స్ బాధ్యత తీసుకోవాలని అదే విధంగా ఆడపిల్లలని బాగా చదివించి వారి భవిష్యత్తును మంచిగా తీర్చిదిద్దాలని, సరైన వయస్సులోనే వివాహం చేయాలని తెలుపుతూ సురక్ష గ్రామ కార్యక్రమంలో భాగంగా సేఫ్ విలేజ్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసిన గ్రామంలో రక్షక్ గ్రామ మిత్ర గ్రామ పెద్ద నోడల్ టీచర్స్‌ను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**వేంపల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :**



వేంపల్లి లోని డాక్టర్ ఎస్ఎఫ్ బాషా హాస్పిటల్ లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి వేంపల్లె పట్టణంలోనీ ప్రజలు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు విచ్చేశారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ గురు అభిలాష్ వైద్య సేవలు అందించారు. అలాగే దాదాపు 150 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 30 మందికి అభిలాష్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఆపరేషన్ కీ రెఫర్ చేసినట్లు డాక్టర్ బాషా హాస్పిటల్ సిబ్బంది వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, డాక్టర్ షాహీన్, వైస్ ఎంపిపి బాబా షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

## 102 కల్లం పట్టలు పంపిణీ

**చిన్నమండెం ఫిబ్రవరి 18 ప్రబాతవార్త:**

మండలంలోని పరమటి కోన సచివాలయం నందు మంగళవారం డ్వాక్రా మహిళ గ్రూపులకు 102 టర్బాలిన్ కల్లం పట్టలను మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరితమ్మ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిలా రైతులు ప్రభుత్వం అందచేసే ఇలాంటి మంచి పథకాలను సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. మండలంలోని పడమటి కోన గ్రామములోని మహిళా రైతు సంఘాల గ్రూపు సభ్యులకు గాను 102 పట్టలను పంపిణీ చేసినట్లు వెలుగు ఏపియం రెడ్డెమ్మ తెలిపారు ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు డ్వాక్రా ఆన్ మీటర్లు డ్వాక్రా మహిళలు రైతు సంఘాలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# రూ.5.51 లక్షలు పలికిన నిత్యపూజ స్వామి తలనీలాలు

**సిద్దవటం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**



శ్రీనిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను అద్దంకి గ్రామ నివాసి మహేంద్ర రూ.5.51 లక్షలకు దక్కించుకున్నారని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో తలనీలాల బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం పాటలో 15 మంది పాటదారులు ఒక్కొక్కరూ రూ.లక్ష దరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. గత ఏడాది తలనీలాలు రూ.5.85లక్షలు పలకగా ఈ ఏడాది రూ.34వేలు తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ ఛైర్మన్, సిబ్బంది చంద్ర, వంతాటిపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం

**చాపాడు. ఫిబ్రవరి 18. ప్రభాతవార్త.**



స్థానిక లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు సాల్ట్ పథకంలో భాగంగా 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుకు పాఠశాల విద్య మహిళా శిశు సంక్షేమ శాఖ సమగ్ర ఆధ్వర్యంలో మంగళవారం నుండి అంగన్వాడిలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్య సంరక్షణ విద్య పాలసీలు, మేధోభివృద్ధి, శారీరక, విద్యాభివృద్ధి, అంగన్వాడీల అభివృద్ధిలో సామాజిక భాగస్వామ్యం వంటి అంశాలపై శిక్షకులు వివరించారు. అదేవిధంగా మండల విద్యాశాఖ అధికారులు రవి శంకర్, వంశీకృష్ణాలు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు ఫౌండేషన్ లో పిల్లల శారీరక మానసిక అభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రిజ్వానాలు, సూపర్వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్నమ్మ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు

**సుండుపల్లె, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :**



మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీసీ, కాపు, ఈ డబ్ల్యూ ఎస్ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 52 యూనిట్లకు గాను 237 అర్జీదారుల అర్జీలను మండలంలోని 5 బ్యాంకుల మేనేజర్లు పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించిన సీఐ

**ముద్దనూరు,ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :**



స్థానిక ముద్దనూరు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి నందు మంగళవారం నాడు సిఐ దస్తగిరి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించారు వాహనదారులతో సిఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని ప్రతి ఒక్కరూ హెల్మెట్ సీట్ బెల్ట్ మరియు మోటార్ వెహికల్ చట్టంలోని రూల్సు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని వాహనదారులకు తెలిపి రికార్డులు తనిఖీ చేసి రికార్డు సరిగా లేటి వాహనాలకు జరిమానా విధించడం జరిగిందని అని సీఐ తెలిపారు,

## కార్పొరేషన్ ఋణాలకు పూర్తయిన ఇంటర్వ్యూలు

**ఖాజీపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**



ప్రభుత్వం చిరు వ్యాపారులకు, స్వయం ఉపాధి వారికి రాయితీతో కూడిన ఋణాలను ఇచ్చి ఆర్థికంగా చేయూతనివ్వడానికి సంకల్పించింది. గత ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా ఒక్కసారి కూడ రాయితీతో కూడిన ఋణాలను ఇవ్వటానికి ముందుకు రాలేదు. ఇప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ అవకాశం కల్పించడంతో ఖాజీపేట మండలంలో దాదాపు 600కు పైగా ఋణాల కోసం ధరఖాస్తు చేశారు. అందులో అర్హత కలిగిన వారికి ఋణాలను అందించడానికి మంగళవారం నాడు ఖాజీపేట బాధ్య ఎంపీడీఓ రమణ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకర్లతో కలిసి ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సంధబ్బంగా ఎంపీడీఓ రమణ మాట్లాడుతూ ఖాజీపేట మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నందు మండలంలోని 6బ్యాంకులకు సంబంధించిన దాదాపు 640మందికి బ్యాంకు ఋణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించామని, రుణాలకి అర్హులయిన వారి వివరాలు నోటీస్ బోర్డు నందు ప్రచురింపబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకు మేనేజర్లు, ఎంపీడీఓ ఆఫీసు సిబ్బంది, ఖాజీపేట వెల్ఫేర్ అసిస్టెంట్ హేమలత మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం

**ఖాజీపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

రైతులను చైతన్య పరుస్తూ క్షేత్రస్థాయిలో పంటలని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ రైతులకు ప్రభుత్వం ప్రయోజనకరంగా నిర్వహిస్తున్న కార్యక్రమం పొలం పిలుస్తోంది. ఈ కార్యక్రమాన్ని మంగళవారం నాడు చెముల్లపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి యం.నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె శాస్త్రవేత్తలు వి.శిల్పకళ మరియు డాక్టర్ కే.సాయి మహేశ్వరి శాస్త్రవేత్తలు పాల్గొని క్షేత్రస్థాయి సందర్శణలో నువ్వుల పంటలను పరిశీలించి కాండం ఎండు తెగుల నివారణకు మంకోజెట్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లీటర్ నీటికి సిఫారసు చేయడం జరిగింది. వరిలో జింక్ నివారణకు రెండు గ్రాములు జింక్ సల్ఫేట్ 2గ్రాములు+5గ్రాములు యూనియా కలిపి ఐదు రోజుల వ్యవధిలో కనీసం మూడు సార్లు పిచికారి చేయవలసిందిగా రైతులకు సూచించారు. డ్రోన్ ద్వారా చెరుకు పంటపై పిచికారిని ప్రదర్శించారు. వ్యవసాయ అధికారి నాగార్జున చెముల్లపల్లెలో రైతు రిజిస్ట్రేషన్‌ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు యన్.వెంకట్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.




# ఫిక్స్డ్ డిపాజిట్లపై అధిక వడ్డీలను పొంది సద్వినియోగం చేసుకోవాలి

**ఖాజీపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

కెనరా బ్యాంక్ వారు ఫిక్స్డ్ డిపాజిట్లపై అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ కే.మురళీమోహన్ ఆదేశాల మేరకు మంగళవారం నాడు ఫిక్స్డ్ డిపాజిట్‌లపై మరియు కెనరా ఏంజెల్ అకౌంట్‌లపై ఖాజీపేట గ్రామంలో డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. అధిక వడ్డీలకు ఆశపడి మోసపూరిత సంస్థలో డబ్బులు పెట్టి నష్టపోవద్దని, ఫిక్స్డ్ డిపాజిట్‌లపై మా బ్యాంక్ ఇస్తున్న అధిక వడ్డీ రేట్లు ప్రజలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఆఫీస్ ప్రతినిధి వెంకటపూర్ణ, రీజనల్ ఆఫీస్ ప్రతినిధి జి.సురేష్, బ్రాంచ్ మేనేజర్ కే.సందీప్‌కుమార్, మేనేజర్ కే.హుస్సేన్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్వాడీల పాత్ర కీలకం

**దువ్వూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**



పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్‌లో అంగన్వాడిల పాత్రలు కీలకం వహిస్తాయని భవిష్యత్తులో అంగన్వాడి సెంటర్లు పాఠశాలల్లో భాగం అవుతాయని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లకు 3రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో బాల సంరక్షణ మరియు విద్యా పాలసీలు, పిల్లల మెదడును అభివృద్ధి చేసే అంశాలు, శారీరక అభివృద్ధి, అంగన్వాడి కేంద్రాల అభివృద్ధిలో సామాజిక భాగస్వామ్యం అనే అంశాల మీద శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం 3రోజుల పాటు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రవిశంకర్, భాస్కర్‌లు అలాగే ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, వరలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు 426మందికి ఇంటర్వ్యూలు

**దువ్వూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు బుధవారం బీసీ రాయితీ రుణాలకు సంబంధించి 426మంది లబ్దిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండలంలోని చింతకుంట, గుడిపాడు, దువ్వూరు, కానగూడూరు బ్యాంకుల పరిధికి సంబంధించి 46యూనిట్లు కేటాయించారని వీటికి గాను ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రమైన దువ్వూరు నుంచి 144మంది ధరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుండి ఇంటర్వ్యూలు మొదలవుతాయని ఆయా బ్యాంకు మేనేజర్లు కూడ పాల్గొంటారని ధరఖాస్తుదారులందరూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.



ఒక్కరోజు జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిలతో కలిసి గండికోట పర్యాటక కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్. గండికోట పర్యాటక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అక్కడ చేపట్టాల్సిన నిర్మాణాలపై జిల్లా కలెక్టర్, సంబందిత అధికారులతో చర్చించిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్. పర్యాటక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మొదటగా ఒబెరాయ్ స్టార్ హోటల్ నిర్మించే ప్రాంతాన్ని, గండికోట రిజర్వాయర్ బ్యాక్ వాటర్, గార్జ్, గార్జ్ వ్యూ పాయింట్, అడ్వెంచర్ ప్రాంతంలో రోప్ వే నిర్మాణం చేపట్టే ప్రాంతం, గ్లాస్ బ్రిడ్జ్ నిర్మించనున్న ప్రాంతం, మాధవరాయస్వామి గుడి, గండికోట లోని దాన్యాగారం, సన్ సెట్ పాయింట్ తదితర ప్రాంతాలను సందర్శించిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్. గండికోట పర్యాటక ప్రాంతాలను తిలకించి ఆనందం వ్యక్తం చేస్తూ ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి.. ఇక్కడ వనరులు పుష్కలంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్. గండికోట పర్యాటక అభివృద్ధిలో భాగంగా.. చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లాతీతో చర్చించిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ తోపాటు పాల్గొన్న స్థానిక యువ నాయకులు భూపేష్ రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి, టూరిజం అధికారి సురేష్ కుమార్ తదితరులు.







## ట్రాక్టరు క్రిందపడి మహిళ మృతి

**రాజుపాళెం, ఫిబ్రవరి18, ప్రభాతవార్త.**

మండల పరిధిలోని పర్లపాడు గ్రామానికి చెందిన దారాల ఆరోగ్యమ్మ (54) అనే మహిళ మంగళవారం ప్రమాదవశాత్తు ట్రాక్టరు క్రింద పడి మృతిచెందినది. ఈవిషయమై యస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.విరాలలోకి వెళ్ళితే రవీంద్రారెడ్డి అనే రైతు పొలంలో శెనపంట నూర్పిడి సమయంలో ట్రాక్టరుక్రింద పడిన ఆరోగ్యమ్మను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపినట్లు సమాచారం.ఈవిషయమై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తెలిపారు.

## ఇద్దరు మట్కాబీటర్లు అరెస్టు

**రాజుపాళెం, ఫిబ్రవరి18, ప్రభాతవార్త.**

మండలపరిదిలోని కుమ్మరపల్లె గ్రామానికి చెందిన పుల్లన్న,కమలాపురంనకు చెందిన వెంకటసుబ్బయ్య అనే ఇద్దరు మట్కాబీటర్లను వెల్లాల గ్రామంలోని వేములమ్మ ఆలయంవద్ద మంగళవారం యస్ఐ వెంకటరమణ అరెస్టు చేసి వారివద్దనుండి రూ.7432ల నగదును స్లిప్పులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

## పాస్‌పోర్టు పోయినది

దిద్దుకుంట రుక్మిణి, భర్త శ్యాంసుందర్ రెడ్డి, బెస్తవారిపాలెం (గ్రామం), వేల్పుల (మండలం), కడప (జిల్లా), ఏ.పి, ఊరి నుంచి చిట్వేలి కి ప్రయాణిస్తుండగా చిట్వేలి బస్టాండులో నా కవరు అందులోని పాస్ పోర్టు నెంబరు: Y6227896 పోయినవి. దొరికిన వారు 9347846787 ఈ నెంబరుకి తెలుపగలరు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు శిక్ష



కలకడ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:

డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రామాంజనేయులు తెలిపారు. గతంలో మండలంలో వాహనాలను తనిఖీ చేసే నిమిత్తములో ఐదుగురైన సీతంపేటకు చెందిన ఎస్.మహమ్మద్, బాలయ్యగారిపల్లి పంచాయతీ కొత్త వడ్డిపల్లికి చెందిన ఎం సురేంద్ర, దేవలంపేటకు చెందిన ఎస్.సాదిక్, తిమ్మాపురం వడ్డిపల్లికి చెందిన ఎం.కిరణ్ కుమార్, బాటవారిపల్లెకు చెందిన సి.శ్రీను ఐదుగురు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడి కోర్టులో హాజరపరిచినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈరోజు అనగా మంగళవారం వాల్మీకిపురం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గురు అరవిందు హాజరు పరిచినట్లు తెలిపారు. మెజిస్ట్రేట్ పూర్వాపరాలు విచారించి, డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ఐదుగురికి ఒక్కొక్కరికి 11 వేల రూపాయలు వంతున 55 వేల రూపాయలు జరిమానా విధించి, ఐదుగురికి వారం రోజులు పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు కానిస్టేబుల్ ముత్యాలు యునెస్ ఇమ్రాన్ మహబూబ్ బాషా హోంగార్డు గిరి తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## శ్రీవీరాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు

రామసముద్రం పిబ్రవరి 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బజారు వీధిలో కొలువై ఉన్న అతిపురాతన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బటర్ ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అర్చనలు, పంచామృతాభిషేకాలు, విశేషా అలంకరణలతో భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు కులశేఖర్ బటర్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## వాల్మీకులను ఎస్టిలో చేర్చాలని వినతి



మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :

వాల్మీకులను ఎస్టీలోకి చేర్చాలని కోరుతూ వాల్మీకి సంఘం నాయకులు మంగళవారం కలికిరిలోని మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వాల్మీకి సేవా సమితి అధ్యక్షుడు విష్ణు చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలోని వాల్మీకుల పరిస్థితిని గమనించి, వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చే విధంగా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని కోరారు. ఇందుకు స్పందించిన మాజీ సీఎం మాట్లాడుతూ వాల్మీకులకు న్యాయం జరిగేలా, వాల్మీకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు వాల్మీకి సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చైతన్య, గంగులప్ప, రాజేంద్రప్రసాద్, గని,బాలు, భరత్, రామకృష్ణ నరసింహులు, శంకర, రాజు, సదా సాయి, శివ,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## హరిజవహర్ లాల్‌ను సన్మానించిన నేతలు

కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



మంగళవారం కడప స్టేట్ గెస్ట్ హౌస్ లో విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి హరిజవహర్ లాల్, ఐఏఎస్ ను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఐ.శివా నాయక్, జిల్లా అధ్యక్షులు జగన్ రాథోడ్ లు మర్యాద పూర్వకంగా కలిసిశారు. పుష్ప గుచ్ఛాము అందించి బంజారా కండువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ నాయక్ మాట్లాడుతూ గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి హరిజవహర్ లాల్ కడప జిల్లాలోని బంజారాల స్థితి గతులు, అభివృద్ధి, వారికి వున్న సమస్యలపైన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారన్నారు. బంజారాలు ఉన్నత చదువులు చదువుకొని అన్ని రంగాలలో ముందుకు వెళ్లాలని సూచించారని వెల్లడించారు.

## జ్ఞాన జ్యోతిపై అంగన్వాడీలకు శిక్షణ



జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈఓ

తంబళ్లపల్లె ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ః

మండలంలోని అంగన్వాడి సెంటర్లలో పని చేసే 51 మంది కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ తరగతులను ఎంఈఓ త్యాగ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిడిపిఓ నాగవేణి మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు మొత్తం 120 రోజులకు గాను మొదటి విడతలో మూడు రోజులు జిసిసిఈ నందు నైపుణ్యతను పెంపొందించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇందులో భాగంగా దేశంలో చేపట్టిన మాతృ విద్యా విధానం నైపుణ్య భారత్, ఎస్ఏఎల్‌టి, ఎఫ్ఎల్ఎన్ యొక్క లక్ష్యాలు సాధనకై అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. ఈ శిక్షణ తరగతులలో డిఆర్పిలు రాధమ్మ, యసనుల్ల, ఈశ్వర్ రెడ్డి, కుసుమారాణి, ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు 20, 21న ఇంటర్వ్యూలు

కురబలకోట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :

బిసి కార్పొరేషన్ రుణాలకు ఈనెల 20న ఎంపిడిఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపిడిఓ గంగయ్య తెలిపారు. రుణాల కోసం ధరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు. 20న కురబలకోట ఇండియన్‌బ్యాంకు పరిధిలోని కురబలకోట, ఎర్రబల్లి, కనసానివారిపల్లె, అంగళ్ళు బ్యాంకు పరిధిలోని అంగళ్ళు, నందిరెడ్డిగారిపల్లె, ముదివేడు సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలోని ముదివేడు, కడపక్రాస్, పిచ్చలవాండ్లపల్లె, తెట్టు ఇండియన్ బ్యాంకు పరిధిలోని తెట్టు, చింతమాకులపల్లె, 21న సిటిఎం ఇండియన్ బ్యాంకుపరిధిలోని మట్టివారిపల్లె, వనమరెడ్డిగారిపల్లె, గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## సాంఘిక సంక్షేమ హాస్టళ్లు తనిఖీ

కడప లీగల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:

ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశానుసారంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.బాబాఫకృద్దీన్ కడప నగరం శంకరాపురంలో ఉన్న ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ కాలేజీ ఫర్ గర్ల్స్ హాస్టల్, శంకరాపురంలో గల ప్రభుత్వ సోష్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్ నెంబర్-2, కడప నగరం మద్రాస్ రోడ్డు నందు గల ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ నెంబర్ 3, కడప నగరం మరియాపురంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ కాలేజీ గర్ల్స్ హాస్టల్ నెంబర్ 2, కడప నగరం ప్రకాష్ నగర్‌లో గల ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌ను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వంట శాలను, వసతి గదులను, టాయిలెట్లను, స్టోర్ రూంను, పరిసరాలను తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వసతి సదుపాయాలను మరియు భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 తదితర అంశాలను వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, వార్డెన్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లలకు విద్యాబుద్ధులు పెంపొందించాలి



ముద్దనూరు, ఫిబ్రవరి 18 ,ప్రభాతవార్త:

అంగన్వాడి కేంద్రాలలోనే పిల్లలకు మంచి విద్యాబుద్ధులను, అక్షర జ్ఞానాన్ని పెంపొందించాలని అంగన్వాడి ఉపాధ్యాయులకు జ్ఞానజ్యోతి అనే శిక్షణ కార్యక్రమాన్ని పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నాడు ప్రారంభించినట్లు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర నాయక్ తెలిపారు. మండల అభివృద్ధి అధికారి ముకుందా రెడ్డి, విద్యాశాఖ అధికారి శివప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని అంగన్వాడి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీడీపీఓ ముంతాజ్ బేగం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు డిఆర్పీలు ప్రభాకర్‌రెడ్డి, విజయ్ కుమార్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## పరిశుభ్రత పాటించి రోగులకు స్ఫూర్తిగా నిలవండి



ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టిన హెడ్ నర్స్ గ్లోరీ.

తంబళ్లపల్లె ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్యం పై దృష్టి సారించి పరిశుభ్రంగా ఉంచుకొని రోగులకు స్ఫూర్తిగా నిలవాలని ఆసుపత్రి హెడ్ నర్స్ గ్లోరీ సూచించారు. మంగళవారం ఆమె ఆసుపత్రి ఆవరణం తో పాటు ఆపరేషన్ థియేటర్, బాలింతల వార్డ్, జనరల్ వార్డ్, మరుగుదొడ్లు, పలు గదులను పరిశీలించి పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేసి పారిశుద్ధ్య నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే శుభ్రం చేయాలని సూచించారు . ఆసుపత్రికి వచ్చే రోగులకు పరిశుభ్రతపై స్ఫూర్తిగా నిలవాల్సిన మనమే అపరిశుభ్రత గా ఉండడం ఏంటని ఆగ్రహించారు. ఆసుపత్రి ఆవరణం శుభ్రపరిచి పూల మొక్కలు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచనలు చేశారు. ఆమె వెంట ఆసుపత్రి సిబ్బంది గోవర్ధన్, పారిశుద్ధ్య నిర్వహకులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర మంత్రిని సన్మానించిన ముక్కా

రైల్వే కోడూరు ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



కేంద్ర విమానయాన శాఖ మాత్యులు కింజారపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు కింజారపు అచ్చెన్నాయుడును మంగళవారం రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జి, కుడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి నివాసంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను ముఖ్యంగా రేణిగుంట విమానాశ్రయమును అభివృద్ధిపరిచి గల్ఫ్ కేంద్రాలకు వెళ్లేవారు కోసం రేణిగుంటలోనే విమానాశ్రయం ద్వారా విమానాలను నడిపే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు రూపానంద రెడ్డి విజ్ఞప్తి చేశారు. కోడూరులోని వ్యవసాయానికి సంబంధిత అవసరాలను రైల్వేకోడూరు ప్రాంతం రైతులకు మేలు చేయాలని అచ్చెన్నాయుడుకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## వైవీయూ వీసీగా ప్రకాష్‌బాబు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:

వైవీయూ ఉపకులపతిగా ప్రకాష్‌బాబును ఉన్నతాధికారులు నియమించారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్లతో పరిపాలన కొనసాగిస్తున్నారు. వైవీయూ నూతన వీసీగా యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాదు సీనియర్ ప్రొఫెసర్ ప్రకాష్‌బాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడేళ్ల పాటు ఇక్కడ వీసీగా కొనసాగనున్నారు.

## పశువైద్య కళాశాల వర్కర్ల ర్యాలీ



తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆప్కాస్ వర్కర్లు

ప్రొద్దుటూరు రూరల్: ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల వర్కర్లు ఆప్కాస్ కొనసాగించాలని 26 వేల రూపాయలు వేతనాలు ఇవ్వాలని మంగళవారం భగత్ సింగ్ కాలనీ నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ అనంతరము ధర్నా చేయడం జరిగింది. ధర్నా ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్ మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేయాలని జీవో 2 విడుదల చేయడం దుర్మార్గమైన ఆలోచనని ఇది కార్మిక వ్యతిరేకమైన విధానమన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వము కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించి ఇంటిదారి పట్టిందని కూటమి ప్రభుత్వం కూడా కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తే మిమ్మల్ని కూడా ఇంటికి సాగనంపుతారన్నారు. కార్మికుల న్యాయమైన కోరికలు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కాంట్రాక్టు వ్యవస్థ తీసుకురాకుండా ఆప్కాసును యథావిధిగా కొనసాగించాలని తదితర డిమాండ్లకై ఆందోళన కొనసాగించడం జరిగింది. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ సిఐటియు కార్యదర్శి విజయ్ కుమార్ పశు వైద్య కళాశాల యూనియన్ నాయకులు నాయకులు డి దేవహుశేన్, ఆర్మీ సుబ్బారావు, రమణ, వి చిన్నఓబులేసు, కేయం కుమార్, గోపాల్ దస్తగిరి రమాదేవి, సుజాత సుస్మిత వీరికి మద్దతుగా యుటిఎఫ్ నాయకులు రవీంద్ర జెవివి సురేష్ మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షులు చండీ ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకుడు బాలసుబ్బయ్య డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ,మహిళా సంఘం నాయకులు రాములమ్మ ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ తదితరులతోపాటు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

వేంపల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :



జ్ఞానజ్యోతి కార్యక్రమం పై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వేంపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపివో వి.సునీత అన్నారు. మంగళవారం వేంపల్లిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లల అభివృద్ధి, ప్రారంభ సంవత్సరం ప్రాముఖ్యతను జాతీయ విద్యావిధానం తెలియజేస్తుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా వయసుకి తగిన ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఇసిసిఇ) ప్రీస్కూల్ కృత్యాలు, అలాగే మహిళా, శిశు సంక్షేమ శాఖ అందించిన ప్రీ స్కూల్ కిట్లను ఉపయోగించడం, అంగన్వాడీ విద్యా ప్రణాళికను అమలు చేయడంలో సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు స్వర్ణలత, నాగరత్న, ఎంఇఓ స్టాలిన్, హెచ్ఎం శివమునెమ్మ, డిఆర్పీలు ప్రతాప్‌రెడ్డి, రాజు, దస్తగిరి పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

### సబ్‌కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :

ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌కు రిటైర్డ్‌మెంటు బెనిఫిట్స్ రూ.5లక్షలు, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. 2019లో ఇస్తున్న అన్ని అలవెన్స్‌లు కలిపి రూ.10వేలు వేతనాలు నిర్ణయించారని అప్పటి నుంచి ఇప్పటి వరకు నిత్యవసర ధరలు పెరుగుతున్నా వేతనాలు పెరగలేదన్నారు. పరీక్షల సందర్భంగా ఆశాలకు విధులు కేటాయించడం వేధింపుల్లో భాగమే అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్స్‌తో వెట్టిచాకిరి చేయించుకొంటున్నారే తప్పా కనీస వేతనం చెల్లించలేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాల్లో ఆశాలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు రమామణి, హారిక, గాయత్రి, మంజుల, మల్లేశ్వరీ, పుణ్యవతి, సుజాత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయుసి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మదనపల్లె, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :



అధ్యక్ష, కార్యదర్శులు

ఏఐటియుసి జిల్లా ప్రథమ మహాసభల్లో ఏఐటియుసి జిల్లా నూతన కమిటీని ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్షులుగా మాదరాజు గంగాదర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మంగిరి సాంబశివను ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షులుగా రాధాక్రిష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వర్రి సురేష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా గాలి చంద్ర, పి.మురళి, నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సాంబశివ, ఉప ప్రధాన కార్యదర్శులుగా సలీంబాషా, సహాయ కార్యదర్శిగా సికింధర్, వేణుగోపాల్‌రెడ్డి, రెడ్డిచైతన్య, జిల్లా కోశాధికారిగా సరోజమ్మను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

## కార్మికుల సమస్యలకై చలో విజయవాడ



కమీషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మదనపల్లె, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :

మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కారానికై మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్‌కుమార్ తెలిపారు. చలో విజయవాడను జయప్రదం చేయాలని మంగళవారం మున్సిపల్ కమీషనర్‌కు యూనియన్‌నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కారానికై పోరుబాటులో భాగంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాలు చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, సాంఘీక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని, ప్రైవేటు కంపెనీలకు, ఏజెన్సీలకు అప్పచెప్పకూడదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు అవుతున్నా సమస్యలపై పట్టించుకోలేదన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు నాగరాజు, పృధ్విరాజ్, ముభారక్, వంశీ, ఓబులేసు, నరసింహులు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరైన తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు

మదనపల్లె, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :



కోర్టుకు హాజరైన దృశ్యం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమంగా నమోదైన కేసుకు సంబంధించి మంగళవారం తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు మదనపల్లె కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు టిడిపి మైనార్టీ నాయకులు తాజ్ ఖాదర్‌ఖాన్, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి షేక్ అలీ, మహబూబ్‌ఖాన్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కక్షపూరితంగా తమపై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. కేసులు అన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఐటి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు.

## నేడు బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రామసముద్రం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :

జిల్లాలోని రామసముద్రం మండలంలో బిసి కార్పొరేషన్ రుణాల కోసం ధరఖాస్తులు చేసుకొన్న లబ్దిదారులకు బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ భానుప్రసాద్ తెలిపారు. బిసి రుణాలకు ధరఖాస్తు చేసుకొన్న లబ్దిదారులు ఓరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు తీసుకు రావాలని ఈ ఇంటర్వ్యూలు బ్యాంకు మేనేజర్ల సమక్షంలో జరుగనున్నట్లు ఎంపిడిఓ తెలిపారు.

## సమగ్రాభివృద్ధి, పాఠశాలల బలోపేతం చేయాలి

### ఎంపిడిఓ గంగయ్య, సిడిపిఓ నాగవేణి

కురబలకోట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :

మూడు, ఆరు ఏళ్ళుగల పిల్లలల్లో సమగ్రాభివృద్ధిని పెంపొందించి పాఠశాలల విద్యను బలోపేతం చేయాలని ఎంపిడిఓ గంగయ్య, సిడిపిఓ నాగవేణిలు అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణా తరగతులను కురబలకోట హైస్కూల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్ఞానజ్యోతి ట్రైనింగ్‌లో అంగన్‌వాడీ కార్యకర్తల నైపుణ్యాలను అవగాహన పెంచుకోవాలన్నారు. ఎంఈఓ ద్వారకనాథ్ మాట్లాడుతూ పిల్లల్లో ఫౌండేషనల్ ఇంటర్నిషి, అండ్ న్యూమరిసి ట్రైనింగ్ ద్వారా అభ్యాసన స్థాయిలను మెరుగుపరుచడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో హైజరైన నమోదుశాతం పెరుగుతుందన్నారు. ఎంఈఓ-2 శ్రీనివాసులు మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమంలో తెలుసుకొన్న అంశాలను క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు అమలుపరచి మెరుగైన ఫలితాలను తీసుకురావాలని సూచించారు. ఈ శిక్షణా తరగతుల్లో ప్రధానోపాధ్యాయురాలు త్రివేణి, సూపర్‌వైజర్ శ్వేత, కళావతి, రామ్మూర్తి, క్రిష్ణప్ప, గణేష్, భూపతి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

## అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలి

మైదుకూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:

బిసి కాపు బలిజ తెలగ, ఒంటరి, ఐ.బి.సి(ఆర్థికముగా వెనకబడిన వర్గం), రెడ్డి మరియు క్షత్రియ కార్పొరేషన్‌కు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 19 వ తేదీన ఉదయం 10:30 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఇంటర్వ్యూలు నిర్వహించబడును, కావున దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ మరియు జిరాక్స్ పత్రాలు తీసుకొని ఇంటర్వ్యూకు హాజరు కావలసినదిగా మండల అధికారి ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఉదయం 10:30 నుండి హాజరు కావలసినవారు ఆదిరెడ్డిపల్లి, వనిపెంట, విశ్వనాధపురం, నంద్యాలం పేట, అన్నలూరు, శివపురం, అప్పనపల్లి, మధ్యాహ్నం 2:00 గంటలకు గంజికుంట, తిప్పిరెడ్డిపల్లి, మిట్టమాను పల్లి, తువ్వపల్లి, ఎన్‌యర్రబెల్లి, డాన్‌ఖాన్‌పల్లె, అప్పనపల్లి అభ్యర్థులు హాజరుకావాలన్నారు.

## 120 రోజుల సర్టిఫికెట్ ప్రోగ్రాం ప్రారంభం



రాయచోటి జనవరి 18 ప్రభాతవార్త

మండలంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి కోర్స్ కోఆర్డినేటర్, మండల విద్యాశాఖ అధికారులు బాలాజీనాయక్, వెంకట శివారెడ్డి, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రమాదేవి, డిఆర్పీలు ఆధ్వర్యంలో కోర్సు ప్రారంభం కావడం జరిగింది. ఈ శిక్షణను ఉద్దేశించి జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక దశలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందింప చేస్తే ఉన్నత దశలలో సంపూర్ణ మూర్తిమత్వ అభివృద్ధి జరుగుతుందని తెలియజేయడం జరిగింది. అలాగే ఉపవిద్యాశాఖ అధికారిగా మాట్లాడుతూ జ్ఞానజ్యోతి కార్యక్రమం ఆవశ్యకతను తెలియజేయడం జరిగింది. కోఆర్డినేటర్ మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రాథమిక దశలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించాలంటే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలంటే పునాది అభ్యసనం అంగన్వాడీ కార్యకర్తలుగా మీకు మీరే సాటి అంటూ కార్యక్రమం సారాంశాన్ని తెలియజేయడం జరిగింది. తదుపరి రోజులలో కార్యక్రమం విధివిధానాలని తెలియజేస్తూ పర్యవేక్షణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్పీలు రాజా రమేష్ వెంకటసుబ్బయ్య సికిందర్, నాగమణి, సుగుణ, శివజ్యోతి, ఎఫ్ఎల్ఎన్ కోఆర్డినేటర్ రాజశేఖర్ సీఆర్పీలు అరుణ్‌బాబు, రవిప్రకాష్ పాల్గొన్నారు.

## నిరుపేద వ్యక్తిని మానవత్వంతో ఆదుకోండి

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



పట్టణానికి చెందిన సుందరయ్య రెండు నెలల నుంచి క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాదులోని బసవతారక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు కానీ అక్కడ హాస్పిటల్‌లో చేరాక ఆ వ్యక్తికి జాండిస్ ఉన్నాయని దానికి సంబంధించిన మెడిసిన్ బయట తెచ్చుకోవాలని అక్కడి వైద్యులు సూచించగా, వారికి ఏమీ తెలియని హైదరాబాదులో సహాయం అడగాలన్న తెలియక చింతిస్తున్న తరుణంలో అనంతపురంలో ఉన్న సామాజిక కార్యకర్త షేక్ నిజాంను సహాయం కోసం ఫోన్ చేయాలని ఒక వ్యక్తి తెలపడంతో వారు తనకు ఫోన్ చేశారని నిజం తెలిపారు

## అర్హత గల ప్రతి బీసీకి మంజూరు చేయాలి



ప్రొద్దుటూరు ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

రాష్ట్రంలో అర్హత గల అందరికీ బీసీ రుణాలను మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు లక్షల జనాభా ఉందని అందులో బీసీ రుణాలు మూడు వేల మంది దరఖాస్తు చేసుకున్నారని కానీ రాష్ట్ర ప్రభుత్వం 312 మందికే రుణాలు మంజూరు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీ రుణాల కొరకు జరుగుతున్న ఇంటర్వ్యూలు తూతూ మంత్రంగానే ముగిస్తారని జోష్యం చెప్పారు. స్థానిక నాయకులు సూచించిన వారికే ఎమ్మెల్యే రుణాల మంజూరుకి అనుమతి ఇస్తున్నారని విమర్శించారు. మూడు లక్షల మంది జనాభాలో మూడు వందలు రుణాలు మంజూరు చేసి గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అర్హతల ప్రతి ఒక్క బీసీకి రుణాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమావేశంలో మండల అధ్యక్షులు సానబోయిన శేఖర్ యాదవ్ మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు కౌన్సిలర్లు గుర్రం లావణ్య భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి పాతకోట వంశీధర్ రెడ్డి వైసిపి నాయకులు చౌడం రవి వైసిపి ప్రచార కమిటీ అధ్యక్షులు దేశ రామ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వేయర్ బదిలీ

పీలేరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్తః



మండల సర్వేయర్ కిరణ్మయి గుర్రంకొండ మండలానికి బదిలీ అయ్యారు. ఈమె పుంగనూరు మున్సిపాలిటీలో సర్వేయర్‌గా పనిచేస్తూ అక్కడ నుంచి బదిలీపై పీలేరుకు వచ్చారు. ఈమెను బదిలీచేస్తూ మంగళవారం జిల్లా స్థాయి ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయని తహశీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. పీలేరు మండల సర్వేయర్‌గా కేవి.పల్లె సర్వేయర్ కీర్తన ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తారని తహశీల్దారు తెలిపారు.

## నేడు బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చిట్వేలి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:

ఆర్థికంగా వెనుకబడిన (బీసీ,ఈ డబ్లు ఎస్,కాపు) కులాలవారికి స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన బీసీ కార్పొరేషన్ రుణాలకు నేడు ఉదయం 10 గంటలకు మండల ఎంపీడీవో కార్యాలయం నందు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ తెలియపరిచారు. అన్ని బ్యాంకు శాఖల ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. దరఖాస్తుదారులు మీ అప్లికేషన్, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డును తప్పకుండా తీసుకుని హాజరుకావాలని ఎంపీడీవో మోహన్ అన్నారు.

## సబ్సిడీ రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు

ముద్దనూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:



బీసీ కార్పొరేషన్, ఈబిసి, రెడ్డి, ఆర్యవైశ్య, కాపు కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు మంగళవారం ఎండిఓ కార్యాలయం నందు ఎండిఓ ముకుంద రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండలానికి కేటాయించిన 32 సబ్సిడీ యూనిట్లకు గాను 315 మంది దరఖాస్తు చేసుకోగా 235 మంది ఈ ఇంటర్వ్యూ లకు హాజరైనారు. ముద్దనూరు మండలంలోని ఎస్బిఐ, ఏపీజీబీ, యుబిఐ, కెనరా బ్యాంకు,ఎర్రగుంట్ల మండలంలోని చిలంకూరు ఏపీజీబీ, కెనరా బ్యాంకు మరియు కొండాపురం ఏపీజీబీ బ్యాంకుల మేనేజర్లు 7 మంది మరియు వారి ప్రతినిధులు హాజరై దరఖాస్తులను పరిశీలించి సదరు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేయడం జరిగింది. అన్ని గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రాథమిక పరిశీలన చేసిన అనంతరం ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమైనవి. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి పరిపూర్ణ అరుంధతి మరియు సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

**సుండుపల్లి, ఫిబ్రవరి 18: ప్రభాతవార్త:**

రెవెన్యూ సదస్సులో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండ త్వరితగతిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సుండుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ మరియు రెవిన్యూ సదస్సుల్లో ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారం ప్రగతిపై తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఓ, విఆర్ఏలతో సమీక్షించారు. ఇందులో భాగంగా.. భూమి సమస్యలపై సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, పెండింగ్లో ఉన్నవి ఎన్ని అని తాసిల్దార్ ను కలెక్టర్ ప్రశ్నించగా మండలంలో మొత్తంగా భూమి సమస్యలపై 506 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ దైవాదీనం కలెక్టరుకు వివరించారు. గ్రామాలలో అంశాల వారీగా అర్జీలు పెండింగ్ ఉండడానికి గల కారణాలను విఆర్ఓ, విఆర్ఏ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హత మేరకు వేగంగా పరిష్కరించాలని సూచించారు.

పిజిఆర్స్ మరియు రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు పరిష్కారం చూపని నలుగురు విఆర్ఓ తిమ్మసముద్రం విఆర్ఓ చిట్టిబాబు, భాగంపల్లి విఆర్ఓ కొండయ్య, జి రెడ్డివారిపల్లి విఆర్ఓ నరసింహులు, ముదుంపాడు విఆర్ఓ హరీష్ మరియు తిమ్మసముద్రం గ్రామ సర్వేయర్ సుబ్బరాయుడులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. మూడు రోజులు లోపల ప్రగతి చూపకపోతే తప్పనిసరిగా శాఖా పరంగా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవిన్యూ సదస్సులను ఏర్పాటు చేసింది ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడం మన అందరి బాధ్యత ఈ సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలను నాణ్యతగా పరిష్కరించడమే అధికారుల లక్ష్యం కావాలి. ఇంకను పెండింగ్ లో ఉన్న వాటిని అంశం వారీగా ఎస్ఎల్ఏ పరిధిలోగా పరిష్కరించాలని సూచించారు. వచ్చిన అర్జీలలో మ్యూటేషన్స్, అసైన్మెంట్, ఆర్ఓఆర్, భూసేకరణ, దారి సమస్యలు, ఫౌతి కేసులు, అన్నదమ్ముల భాగ పరిష్కారాలు, డిస్ప్యూట్స్, సివిల్ కేసులు తదితరాలను సమీక్షించి తీసుకోవల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయికి వెళ్తే భూసేకరణ, దారి సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. 3 రోజుల్లో దారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు.

మండలంలోని కంచిపాటి వాండ్లపల్లిలో ఆక్రమించిన ప్రభుత్వ భూమిలోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం భూములు ఎక్కడైనా ఆక్రమణ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రభుత్వ భూములకు వాటికి రక్షణ కల్పించాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. అనంతరం సుండుపల్లె3 పరిధిలో యర్రగుట్ట ప్రాంతంలో స్మశాన వాటిక ఏర్పాటు నిమిత్తం క్షేత్రస్థాయిలో కలెక్టర్



స్థల పరిశీలన చేశారు. స్మశాన వాటికకు భూమి కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నట్లు తాసిల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా ఇందుకు అక్కడ 1.18 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నట్టు తాసిల్దార్ వివరించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ గ్రామస్తుల సౌకర్యార్థం అదే ప్రాంతంలో స్మశాన వాటిక నిమిత్తం భూమి కేటాయింపునకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు,మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, విఆర్ఓ, విఆర్ఏలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా జంప్ రోప్ ఛాంపియన్షిప్ 2024-2025

### పలువురి ప్రశంసలు అందుకున్న ముబారక్,



**మైదుకూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 13 నుంచి 15 ఫిబ్రవరి 2025 వరకు నాసిక్ (మహారాష్ట్ర) లో జరిగిన పోటీలో మండల పరిషత్ మైదుకూరు బాలుర పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ముబారక్ 21వ జూనియర్ మరియు సీనియర్, 4వ ఆల్ ఇండియా జంప్ రోప్ ఛాంపియన్షిప్ 2024-2025. తృతీయస్థానం సాధించాడు. ఫిజికల్ డైరెక్టర్ వినోనియా, చంద్రవతి, హెడ్ మాస్టర్ గోశెట్టి రామమోహన్, ఉపాధ్యాయులు, మీసాల మునయ్య, ఆవుల శ్రీనివాసులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## పెరిగిన ఉష్ణోగ్రతలు, ప్రజలకు సేదదీరుస్తున్న చల్లని పానియాలు



కొబ్బరిబొండాల తోపుడుబండ్లపై ఉన్న దృశ్యం



చల్లదనాన్ని ఇచ్చే పుచ్చకాయలు

**రామసముద్రం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :**

ఈ ఏడాది మార్చినెల వచ్చీరాగానే ప్రజలకు వేసవితాపం మొదలైంది... ఎండలు మండుతున్నాయి. ప్రజలు ఎండతాపం తీర్చుకునేందుకు చల్లని పానియాలపై దృష్టి సారించారు. శీతల పానియాలైన కొబ్బరిబొండాలు, మజ్జిగ, కూల్‌డ్రింక్‌లకు గిరాకీ పెరిగింది. కూల్‌డ్రింక్స్ అమ్మే షాపులు కూడా కాస్త రద్దీగా కనపడుతోంది. ఇదే అదునుగా భావించిన దుకాణదారులు ఒకేసారి ధరలు పెంచేశారు. కొబ్బరి బొండాలు తోపుడుబండ్లపై అమ్ముతుంటారు. స్థానిక పిహెచ్‌సి వద్ద బండ్లపై కొబ్బరి బొండాలు లభిస్తాయి. అయితే ఒకొక్క కొబ్బరి బొండం ధర రూ.35నుంచి 40రుపాయల మేరా అమ్ముతున్నారు. దుకాణదారులు కూల్‌డ్రింక్స్ ధరలు గత నెలలో కంటే ఈనెలలో అధిక రేట్లు పెంచుదల చేశారు. పుచ్చకాయలు గత ఏడాది కిలో రూ.10చొప్పున అమ్మకాలు జరిపితే ఈ ఏడాది కిలో రూ.20లు పులకుతోంది. ఈ లెక్కన ఒకొక్క పుచ్చకాయ పెద్దవి రూ.90నుంచి 100ల మేరా వెచ్చించాల్సి వస్తోంది. అయినప్పటికీ పుచ్చకాయలపై ఇష్టంతో ప్రజలు చల్లదనాన్ని కొరుకొంటు ఎగబడి తింటున్నారు. పుచ్చకాయ ముక్క ఒకొక్కటి రూ.20లు చొప్పున అమ్ముతున్నారు. ఇదిలా ఉంటే సాయంత్రం సమయానికి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో చల్లదనంతో ప్రజలు కొంత సేదతీరుతున్నారు. ఏదైనప్పటికి ప్రజలు అవసరాలను గుర్తించిన కూల్‌డ్రింక్స్ యజమానులు అధిక ధరలకు అమ్మి ప్రజల జేబులను ఖాళీ చేస్తున్నారు. ప్రజలకు ఎండతాపం తీర్చుకోవాలంటే కొబ్బరిబొండాలు, మజ్జిగ, కూల్‌డ్రింక్స్, లస్సీలు, నన్నారీలు వాడక తప్పడం లేదు.

## స్కూల్ పిల్లలకు ఆట వస్తువుల వితరణ



**పులివెందుల రూరల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :**

వేముల మండలములోని కనుమ క్రింద కొట్టాల గ్రామములోని ఎంపీపీ స్కూల్ నందు యురేనియం ప్రాజెక్ట్ లోని ఎస్ఎంఎస్ లిమిటెడ్ కంపెనీ తరపున చీఫ్ విజిలెన్స్ ఆఫీసరు ఖలీల్ సొదాగర్, హెచ్ ఆర్డీజీఎం సీనియర్ మేనేజరు రామకృష్ణ, సహాయ మేనేజరు పవన్ రెడ్డి, కో ఆర్డినేటర్ సింగం సురేష్ రెడ్డి,లు పిల్లలకు వివిధ ఆట వస్తువులను హెడ్ మాస్టర్ మల్లికార్జున సమక్షంలో బహూకరించారు. క్రీడలు పిల్లల జీవితాలలో ప్రధాన పాత్ర పోషిస్తాయని, వారు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదిగేందుకు ఉపయోగపడుతాయని, పిల్లలు చదువులో కూడా ఎంతో చురుకుగా ఉంటారని ఖలీల్ సొదాగర్ తెలిపారు. తల్లితండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడలలో కూడా ప్రోత్సహించాలని సూచించారు.

## విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



**రాజంపేట అర్బన్ ఫిబ్రవరి18 ప్రభాతవార్త**

రాజంపేట మండలం, బోయనపల్లి అరుంధతి వాడ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 100 మంది పేద విద్యార్థులకు,రాజంపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. రాజంపేట లైన్స్ క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు, సీనియర్ ప్రతినిధి డాక్టర్ బాలరాజులు వచ్చే వేసవి దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకోసం తాగునీటి సీసాలు, నోటు పుస్తకాలు, విద్యా సామాగ్రిని పంపిణీ చేసారు. విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేసిన లైన్స్ క్లబ్ ప్రతినిధులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కురబలకోట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :**

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలని ఎస్వి యూనివర్శిటి మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొపెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మిట్స్ కళాశాలలో భవిష్యత్తు నాయకుల కోసం వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన, వ్యక్తిగత బుద్ధికి మానసిక అంతర్దృష్టులు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వృత్తిని పెంపొందించుకునేందుకు బలమైన వ్యక్తిగత లక్షణాలతో అనుసందానం చేయడంతో ప్రాముఖ్యతను వివరించారు. పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాశం భవిష్యత్తు నాయుకులకు రూపొందించడంలో కీలకమైన అంశం అన్నారు. నాయకత్వం అనేది సాంకేతిక జ్ఞానం నైపుణ్యం గురించే కాని కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఇతరులను ప్రేరేపించే సామర్థలను గురించి ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.రామనాథన్, డీన్ శ్రీమంతబుబసు, తుల సీరామ్‌నాయుడు, దస్తగిరిబాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి



**పెనగలూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మంగళవారం నుంచి జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం జరుగుతుందని సిడిపిఓ నిర్మల జ్యోతి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుండి 120 రోజుల వరకు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిట్వేల్ సిడిపిఓ నిర్మల జ్యోతి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను అంగన్వాడి టీచర్లు అందరూ కలిసి బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లల సమగ్రాభివృద్ధి సాధించడానికి తీసుకోవలసిన అంశాలపై మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు సాల్ట్ 6 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కోర్స్ డైరెక్టర్ ఎంఈఓ 1, ఎం గిరి వరదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 , నాగ సుబ్బరాయుడు, డిఆర్పీలు ఎం .శేషారెడ్డి, కే.సురేష్ అంగన్వాడి సూపర్వైజర్లు విజయ కుమారి విశాలాక్షి అంగన్వాడీ టీచర్లు మరియు ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

## కెయస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల మెగా విజయం



MEIL శుక్రవారం కెయస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 80 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వివిఎస్ మూర్తి తెలిపారు. ఇందులో 52 మంది సివిల్, 13 మంది మెకానికల్, 15 ఈఈఈ విద్యార్థులు, ఎంపికైనవారికి ట్రైనింగ్ కాలంలో సంవత్సరానికి రూ.2.3 లక్షలు, ట్రైనింగ్ పూర్తయిన వారికి రూ.5 లక్షలు వేతనం ఉంటుందన్నారు. ఎంపికైన విద్యా ర్థులను ఉద్దేశించి మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ Meil lo మెరిసినా తమ విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను మరియు ప్రతిభ పాటవాలను ఉపయోగించుకొని ఈ ప్రాంగణ ఎంపికల్లో విజయం సాధించినందుకుగాను అభినందించారు. కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, వైస్ ఛైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్ ప్రసాద్, డీన్‌లు వివిధ విభాగాల అధిపతులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## అనాథ వృద్దులకు చేయూతనిస్తాం

### :వృద్దులను పరామర్శించిన శివసాయి ఈవెంట్స్‌టీం



**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**

పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉండే ఆనందనిలయం నిరాశ్రయుల వసతి గృహంలోని అనాథ వృద్దులను మంగళవారం బద్వేలు శివసాయి ఈవెంట్స్ సాయి టీం సభ్యులు పలువురు సందర్శించి ఆసరా కోల్పోయిన అనాథ వృద్దుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. గత కొద్ది రోజుల క్రితం అనాథాశ్రమానికి శివసాయి ఈవెంట్స్ తరపున కొంత చేయూతనివ్వడం జరిగింది. మంగళవారం శివసాయి ఈవెంట్స్ అనాథ వృద్దులకు రుచికరమైన భోజనం, పండ్లు, స్వీట్లు తినుబండారాలను పలువురికి అందజేశారు. అనంతరం సాయి మాట్లాడుతూ అనేక రకాలుగా ఆదరణ కోల్పోయిన అనాథలకు శివసాయి ఈవెంట్స్ తరపున తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనాథవృద్దులను దరిచేర్చుకుని పిడతల రవి కుమార్ సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో రోషన్, విజయ్, మస్తాన్, మున్ని, గాయత్రి, అశోక్, ప్రశాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మాఘమాసంలో హనుమంతునికి ప్రత్యేక పూజలు

**బద్వేలు అర్బన్ ,ఫిబ్రవరి18, ప్రభాతవార్త :**



పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో మాఘమాసం మూడవ మంగళవారం సందర్భంగా ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి అభిషేకం, సిందూరం అర్చన, ఆకుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ఉభయదాతలుగా నాగేంద్రనాథరెడ్డి, సతీమణి ఉమామహేశ్వరి, గొల్లమందవేణుగోపాల్ రామక్రిష్ణ, సతీమణి శ్రీదేవి కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కోరిన కోర్కెలు తీర్చే అభయాంజనేయ స్వామి వారిని పలువురు భక్తులు, భక్తి, శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయనిర్వాహకులు వి.వి.రమణ పలువురు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ

**ఖాజీపేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

మండలంలోని అంగన్వాడి కార్యకర్తలకు మంగళవారం నాడు ప్రభుత్వం నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమాన్ని ఖాజీపేట ఆదర్శ పాఠశాల నందు ఖాజీపేట యం.ఈ.ఓ.లు నాగ స్వర్ణలత, సత్య నాగరాజు మరియు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహులు ప్రారంభించారు. అంగన్వాడి సెంటర్‌లకు పిల్లలని పంపాల్సిన ఆవశ్యకతని తల్లిదండ్రులకి వివరించి వచ్చిన పిల్లలకు చేయాల్సిన బోధన పద్ధతుల గురించి, వారికి అందిస్తున్న పోషకాహారం గురించి తెలియజేయడం ఈ జ్ఞానజ్యోతి కార్యక్రమ ఉద్దేశం అన్నారు. ముఖ్యంగా అంగన్వాడి పిల్లలకి కార్యకర్తలు అవలంబించాల్సిన బోధనా పద్ధతుల గురించి ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. మండలంలోని 84 మంది అంగన్వాడి కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్పిలు జానకీరామ్, కేవి సుబ్బారెడి, సుమన్, భారతి, రమాదేవిలు పాల్గొన్నారు.



## మాచుపల్లిలో పొలం పిలుస్తోంది



**సిద్దవటం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలం, మాచుపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బద్వేలు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు, మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, మాచుపల్లి రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు టి.లక్ష్మీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవో రమేష్‌రెడ్డి మంగళవారం మాటాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తారని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన అన్ని రకాల పంటలను ఈ పంట కింద నమోదు చేసి ఈకేవైసీ ప్రక్రియను కూడా పూర్తి చేయాలన్నారు. అలాగే సొంత భూమి కలిగిన డికెటీ భూములు రైతు కూడా 11 అంకెల రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా పొందాలి. దీనికి ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ కలిగిన మొబైల్ నెంబర్ పట్టాదారు పాసు పుస్తకంతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు ప్రయోజనాలు పొందడానికి ఇది చాలా అవసరం ఉంటుందన్నారు. అనంతరం టక్కోలు గ్రామంలో పలు పంటలు మోడల్‌ను పరిశీలించి సాగు చేసిన మహిళా రైతు శ్రీమతి బి.భాగ్యలక్ష్మిని అభినందించారు.

## ట్యాంకర్లతో మంచినీటి సరఫరా



**కలికిరి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ గజ్జలవాండ్లపల్లె పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి గిరి ఆధ్వర్యంలో మంగళవారం ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేయడం జరిగింది. గ్రామంలోని మంచినీటి బోర్లలో నీటి శాతం తగ్గడంతో గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తింది. దీంతో స్థానిక సర్పంచ్ ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేపట్టారు. అనంతరం సాథనిక సర్పంచ్ మాట్లాడుతూ గజ్జలవాండ్లపల్లెలో మంచినీటి సమస్యను స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తేవడం జరిగింది. దీంతో సమస్య పరిష్కారం అయ్యింది.

## ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే కిశోర్ బిజీబిజీ

**కలికిరి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

నియోజకవర్గంలోని మండలాల సమస్యలు పరిష్కరించడంలో మంగళవారం పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బిజీ బిజీగా ఉన్నారు. మంగళవారం నియోజకవర్గం నుంచి సమస్యలతో అధిక సంఖ్యలో ప్రజలు నగరిపల్లెకు చేరుకొని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆ సమస్యలపై ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్‌లో సమాచారం అందించి పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు నియోజకవర్గంలోని మండలంలోని గ్రామాల్లో సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వాల్మీకిపురం, తరిగొంగడ పంచాయతీల్లో జరగనున్న బ్రహ్మోత్సవాలను సంబంధిత అధికారులు విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మండల స్థాయి అధికారులు మంచినీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## ఇమాములు మోజనులకు వేతనాలు విడుదల పట్ల హర్షం

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )**

రాష్ట్రంలోని ఇమాములు, మోజనులకు, వేతనాలను విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి రాష్ట్ర రోడ్ల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి. గుల్జార్ భాష హర్షం వ్యక్తం చేశారు. 2024 మరియు 2025 ఆర్థిక సంవత్సరానికి గౌరవ వేతనాలకు సంబంధించిన నిధులు. ఇమామ్లకు రూ పదివేలు మోజలకు రూ 5 వేల రూపాయల చొప్పున. మొత్తము రూ 45 కోట్లు విడుదల చేసినట్లు ఉత్తర్వులు. ఇచ్చినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే న్యాయశాఖ, మైనార్టీల సంక్షేమ అభివృద్ధి శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి కూడా ధన్యవాదాలు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు అన్యాయం చేసిందని ఒక్క పైసా కూడా నిధులు విడుదల చేయక. మైనార్టీలను మోసం చేసిందని ఆయన తెలియజేశారు. ఆంధ్ర రాష్ట్రంలోని యావత్ మైనార్టీలు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరుస్తున్నారని ఆయన తెలియజేశారు.

## ఎత్తిపోతల పథకాన్ని పటిష్ట పరచండి

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )**

ఒంటిమిట్ట చెరువు కింది ఆయకట్టుదారులను ఆదుకోవాలని, ఒంటిమిట్ట చెరువుకు నీరు అందించే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పటిష్ట పరచాలని అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షుడు సాయి లోకేష్ కడప జిల్లా కలెక్టర్కు మంగళవారం విజ్ఞప్తి చేశారు. 20 సూత్రాల అమలు కార్యక్రమం చైర్మన్ లంక దినకర్ కడప జిల్లా కలెక్టరేట్ సముదాయం వద్ద వివిధ సంక్షేమ మరియు అభివృద్ధి పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థాయి లోకేష్ సోమశిల ప్రాజెక్టు నుంచి ఒంటిమిట్ట చెరువుకు శ్రీరామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ 13కిలోమీటర్ల పొడవునా సిమెంట్ పైప్‌లైన్ తో నీటిని ఎత్తిపోతుల ద్వారా వొంటిమిట్ట ట్యాంకు నింపుతూ దాని కింద 1014 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూపొందించారన్నారు. అయితే, తరచుగా బ్యాక్ ప్రెజర్ కారణంగా పైప్‌లైన్ పగిలిపోవడం వల్ల పంపింగ్ నిలిచిపోతున్నాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కారణంగా ఒంటిమిట్ట చెరువు కింద ఆయకట్టు రైతులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. వీరికి శాశ్వత ప్రాతిపదికన సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు సత్వరం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం 3కిలోమీటర్ల సిమెంట్ పైప్‌లైన్ బదులుగా ఎం ఎస్ పైపులను అమర్చాల్సిన అవసరం ఉంది అన్నారు. దీనికి వ్యయం రూ.10.40 కోట్లు అంచనా వేశారని వివరించారు. కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని కలిసి ఒంటిమిట్ట మండల వ్యవసాయ, తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఈ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట బిజెపి నాయకులు కృష్ణ యాదవ్, జయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## 165 మంది దరఖాస్తుదారులు

**గోపవరం , ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :**

బీసీ సంక్షేమ శాఖ కింద వివిధ రకాల సబ్సిడి లోన్లకు సంబంధించి గోపవరం మండలం నుంచి 285 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం జరిగిన ఇంటర్వ్యూకు 165మంది దరఖాస్తుదారులు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను స్వయం ఉపాధి పథకం కింద వివిధ రకాల సబ్సిడి లోన్లకు దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈడబ్ల్యుఎస్ మరియు కాపు కులములకు చెందిన దరఖాస్తుదారులు ఇంటర్వ్యూకు తాము తెలిపిన ఒరిజినల్ దరఖాస్తు, ఇతర ఆధారాలతో హాజరైనట్లు ఆయన తెలిపారు.

## భూ కబ్జాలను అరికట్టండి

### - ఆర్డీవోను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ అధితి సింగ్

**సిద్దవటం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె మాధవరం-1 గ్రామ పంచాయతీలలో జరుగుతున్న భూ కబ్జాలను అరికట్టాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్‌ను జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ ఆదేశించారు. మండల కేంద్రమైన సిద్దవటం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులపై జాయింట్ కలెక్టర్ సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి శుక్రవారం వరకు జిల్లాలోని రెండు మండలాలు తనిఖీ చేసి సిబ్బంది పనితీరు పర్యవేక్షిస్తున్నామన్నారు. అందులో భాగంగా సిద్దవటం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, రీసర్వే, గ్రీవెన్స్ పరిష్కారం, సిబ్బంది పనితీరు పర్యవేక్షించడం జరిగిందన్నారు. జేసీ సిద్దవటం తహసీల్దారు కార్యాలయం వచ్చిన విషయాన్ని తెలుసుకొని రైతులు తమ భూ సమస్యల పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

